# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 15, అక్టోబరు, 2014

హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు నగరంలోని అన్ని వర్గాలు సహకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కోరారు. హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనను ప్రజా ఉద్యమంగా చేపట్టాలని, ఇందుకోసం నాలుగు రోజుల పాటు శ్రమదానం కార్యక్రమం కూడా నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి రాత్రి పొద్దుపోయే వరకు హుస్సేన్‌సాగర్‌ను శుద్ధిచేసే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మధ్యలో హుస్సేన్‌సాగర్‌ను చూసి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం, దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మ నిమజ్జనం కోసం ఇందిరాపార్క్‌లో నిర్మించతలపెట్టిన చెరువుకు అన్ని హంగులు కల్పించాలని చెప్పారు. నిమజ్జనం కార్యక్రమాన్ని హుస్సేన్‌సాగర్ నీటిలోనే చేయాలనే సెంటిమెంట్ ఉన్నందున ఆ చెరువును కూడా హుస్సేన్‌సాగర్‌లోని నీటితోనే నింపాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి వినాయకసాగర్ అనే పేరు పెట్టాలన్నారు. ఈ విషయంలో నగరంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, కార్పోరేటర్లు, గణేష్ ఉత్సవ కమిటీలతో వీలైనంత తొందరలో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హుస్సేన్‌సాగర్‌లోకి నాలాల ద్వారా రోజుకు 527 మిలియన్ లీటర్ల మురికినీరు వస్తున్నా కేవలం 368 మిలియన్ లీటర్ల నీటిని తరలించడానికి మాత్రమే పైపులైను వుందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ వీలైనంత వరకు మురికినీరు హుస్సేన్‌సాగర్‌లోకి రాకుండానే చూడాలని, చెరువు ప్రక్కన మురికినీరు పోవడానికి ప్రత్యేక కాలువలు నిర్మించాలని, వాసన రాకుండా వాటిపై స్లాబ్ కూడా వేయాలని, ఆ స్లాబ్‌లను వాకింగ్ కోసం ఉపయోగించుకోవచ్చని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యంగా కూకట్‌పల్లి నాలా నుంచి రసాయన పదార్థాలు కూడా వస్తున్నందున ఆ నాలాను పూర్తి స్థాయిలో మళ్లించాలని చెప్పారు. ప్రస్తుతం హుస్సేన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 0.9 టిఎంసిలుగా ఉందని చెప్పారు. హుస్సేన్‌సాగర్ భూ భాగంలో ఆక్రమణలు ఉన్నాయని, కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయని, వీటిని వీలైనంత తొందరలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డిని కోరారు. రేయిన్‌వాటర్ తప్ప డ్రేయిన్ వాటర్ హుస్సేన్‌సాగర్‌లోకి రాకుండా చూడాలన్నారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరం మొత్తాన్ని పరిశుభ్రమైన నగరంగా మార్చాలని, నగరంలోని 1700 మురికివాడల రూపు రేఖలను కూడా మార్చాలని ముఖ్యమంత్రి సంకల్పించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం